సాక్షి
ఒడిశా
శనివారం । 24 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5.40.176
బంగారం : 200 మిల్లీ గ్రాములు
వెండి : 36 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



ఎవరి కన్న బిడ్డో..
పర్లాకిమిడి ఆస్పత్రిలో ఏడాది బిడ్డను వదిలి వెళ్లిపోయారు. అధికారులు సంరక్షించారు.
- 10లో▸



రోడ్డు పనులపై మండిపాటు
రోడ్డు పనులపై స్థానికులు మండిపడ్డారు. అధికారులను నిలదీశారు.
- 10లో▸

న్యూస్‌రీల్

మందకొడిగా జగన్నాథ రథం తయారీ!



పర్లాకిమిడిలోని జగన్నాథ మందిరం బయట రథాల చక్రాలు

పర్లాకిమిడి: పూరీ పుణ్యక్షేత్రంలో జగన్నాథ రథాయాత్ర తరువాత పర్లాకిమిడిలోనే అతిపెద్ద రథాయాత్ర జరుగుతుంది. అయితే రథాయాత్రకు ఇంకా నెలరోజులే సమయం ఉండగా ఇప్పటివరకూ రథాల నిర్మాణం జరగ లేదు. ఏటా జగన్నాథ, బలరామ, సుభద్ర రథాలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం జగన్నాథ ఆలయం వెలుపల పాత రథాల కలప, ఇరుసులు, జగన్నాథ రథ చక్రాలు బయటకు తీసు సిద్ధం చేశారు. రథాల తయారీకి వడ్రంగులు, పనివారు కొరత వల్ల ఇప్పటివరకూ నిర్మాణం జాప్యం జరుగుతున్నదని రథాయాత్ర కమిటీ సభ్యులు చెబుతున్నారు. జూన్ 27న రాష్ట్రంలో రథాయాత్ర పూరీ పుణ్యక్షేత్రంలో జరుగనున్నది.

జగద్గురు శంకరాచార్యులకు భద్రత పెంపు



లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: పూరీ గోవర్ధన పీఠాధిపతి పూజ్య జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతికి భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయనున్నారు. జగద్గురు భద్రత పెంపు ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో శుక్ర వారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పూరీ లోక్ సభ సభ్యుడు సంబిత్ పాత్రో, న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్, శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి డాక్టరు అరవింద కుమార్ పాఢి తదితర ప్రముఖులు హాజరయ్యారు. పూరీ గోవర్ధన్ పీఠం పరిరక్షణ, మునుపటి ఆచార్యులందరి సమాధి స్థలాలను సంరక్షణ, పూజ్య జగద్గురువులకు భద్రతా ఏర్పాట్లు, పీఠ ప్రాంగణంలోని గోవర్ధన్ గోశాల అభివృద్ధి, మహా దధి తీరంలో సంధ్యా హారతి స్థల అభివృద్ధిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. గోవర్ధన్ పీఠం పరిధీయ అభివృద్ధిపై నివేదికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి పూరీ కలెక్టర్‌ను ఆదేశించారు. మహా దధి సంధ్యా హారతి స్థలిని మరింత ఆకర్షణీయంగా మలచి భక్తులు, యాత్రికులు, పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకునే కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా పూరీ గోవర్ధన్ పీఠం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను అత్యంత ప్రాధాన్యతతో చేపడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బరిగుడలో ఏనుగుల హల్‌చల్



బరిగుడ సమీపంలో సంచరిస్తున్న ఏనుగు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చాటికొన పంచాయతీ బరిగుడ గ్రామ సమీపంలో ఓ ఏనుగు హల్‌చల్ సృష్టిస్తోంది. గురువారం రాత్రి జనావాసాల్లోకి ప్రవేశించి మామిడి, అరటితోటలను ధ్వంసం చేసింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత రైలు మార్గాన్ని దాటి ఏనుగు అడవుల్లోకి వెళ్లిపోయింది. అయితే మళ్లీ తిరిగొస్తుందేమోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.

చోరీ కేసులో యువకుడి అరెస్టు

- మరో ఐదుగురి కోసం గాలింపు

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఈశ్వర్ నాయక్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా చోరీ ఘటనలో మరో ఐదురుగు ఉన్నట్లు అంగీకరించాడు. దీంతో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. సికరపాయిలో నివాసముంటున్న గోపాలశెఠి ఉపేంద్ర అనే వ్యక్తి ఇంట్లోకి మావోయిస్టులమని చెప్పి చొరబడిన దుండగులు దంపతులపై దాడి చేయడంతో పాటు 14 తులాల బంగారం, రెండు క్వింటాళ్ల వెండి ఆభరణాలు చోరీ చేసి పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి కళ్యాణ సింగుపూర్ పోలీస్‌స్టేషన్ ఉన్నతాధికారి నీలకంఠ బెహర, ఎస్ఐ హేమంత్ కుమార్ బరిహా, ఎస్ఐ దిలిప్ మాఝి, కానిస్టేబుల్ కార్తీక్ సాబొరోలతో కూడిన ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో సమితిలోని పూజారిగుడ గ్రామానికి వెళ్లే రహదారిలోని మామిడి చెట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన పోలీసులు దాని ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో
- రాయగడలో పలువురికి కార్డుల పంపిణీ



రేషన్‌కార్డుల లబ్ధిదారులతో మంత్రి పాత్రో, బీజేపీ నాయకులు



గజమాలతో మంత్రిని సన్మానిస్తున్న అభిమానులు

రాయగడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కృష్ణచంద్ర పాత్రో అన్నారు. జిల్లాలో శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతగా రాష్ట్రంలో 6 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని చెప్పారు. పంచాయతీ దినోత్సవం నాడు జిల్లాల వారీగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్న ప్రజల దుస్థితిని గమనించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ మేరకు చర్యలు తీసుకున్నారని చెప్పారు.

బోగస్ కార్డుల ఏరివేత..

అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేయడంతో పాటు దాదాపు 5 లక్షల బోగస్ రేషన్ కార్డులను ఏరివేసినట్లు మంత్రి చెప్పారు. వాటి స్థానంలో అర్హులైన వారిని గుర్తించి కొత్తగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల వల్ల సరుకులతో పాటు సుభద్ర, ఆయుష్మాన్ కార్డులు వంటి పథకాలను పొందవచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట..

రాష్ట్రం ఆర్థిక, సామాజిక రంగాల్లో పురోగతి చెందాలంటే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందని మంత్రి తెలిపారు. రైతులను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సాగునీటి వనరులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. త్వరలో సుమారు 15 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరందించే విధంగా బృహత్తర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రైతులతో ముచ్చట్లు..

సదరు సమితి పరిధిలోని వీరనారాయణపురంలో పర్యటించిన మంత్రి పాత్రో ఆయా ప్రాంతాల్లో రైతులతో కాసేపు ముచ్చటించారు. అన్నదాతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి వనరుల పనితీరుపై ఆరా తీశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయా అన్ని రైతులను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతి క్వింటాల్ ధాన్యానికి రూ.2300 మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ కింద మరో రూ.800 అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ రైతు మాధవరావు సరక ఇంట్లో రాగిజావను ఆరగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్, ఎస్సీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, పార్టీ రాష్ట్ర శాఖ సభ్యుడు బసంతకుమార్ ఉలక, యాల్ల కొండ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక బిజుపట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాత్రోకు గజమాలతో సత్కరించారు.



వీరనారాయణపురంలో మంత్రికి ఘనస్వాగతం



రైతు సరక ఇంట్లో అల్పాహారం ఆరగిస్తున్న మంత్రి

కొటియా సమగ్ర అభివృద్ధికి ఉన్నత స్థాయి ప్యానెల్

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు కొరాపుట్ జిల్లా కొటియా గ్రామ పంచాయతీలో దీర్ఘకాలిక పాలనాపరమైన సమస్యలకు తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తాండవిస్తున్న సవాళ్లను పరిష్కరించి సమ్మిళిత అభివృద్ధి చేసేందుకు కీలకమైన నిర్ణయంతో ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత యంత్రాంగం ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ జిల్లా పొట్టంగి మండలం పరిధిలోని కొటియా గ్రామాల సముదాయానికి బలమైన, సమగ్ర పరిపాలనా వ్యవస్థ ఆవశ్యకతపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించడం విశేషం. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వ నిర్ణయం వాస్తవ కార్యాచరణ కోసం రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి అధ్యక్షతన 16 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఉన్నత స్థాయి ప్యానెల్ కార్యాచరణ శైలిని ఖరారు చేస్తుంది. ఈ కమిటీ వివిధ శాఖల పథకాలకు ఏజెన్సీ కార్యాచరణ సోపానక్రమం, నిధుల వినియోగ విధానం, సమ్మిళిత నమూనాను నిర్వచిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల తులనాత్మక విశ్లేషణను కూడా నిర్వహిస్తుంది. దీంతో సరిహద్దు కొటియా ప్రాంతం ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలు సమానంగా లేదా మెరుగ్గా లభిస్తాయని ప్రభుత్వం యోచిస్తుంది.

ప్రతిపాదిత ప్రత్యేక సంస్థకు ఒడిషా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) లేదా ఒడిషా రెవెన్యూ సర్వీస్ (ఓఆర్ఎస్) కేడర్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారు. స్వతంత్ర కార్యాలయంతో పని చేస్తారు. కొటియా గ్రామ పంచాయతీ నివాసితులకు సమర్థమైన సమన్వయంతో కూడిన సేవలను అందించడం కోసం ప్రస్తుతం స్వతంత్రంగా పనిచేస్తున్న అన్ని విభాగ సేవలను ఒకే వ్యవస్థ అధీనంలోకి తీసుకురావడం దీని లక్ష్యం.

సరిహద్దు ప్రాంతాలలో ఒడియా ఆత్మ గౌరవం విస్తృత చొరవ కింద ఒడియా భాష, సాహిత్యం, పండుగలు, సంప్రదాయాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక జనాభాతో బలమైన అనుబంధ భావాన్ని పెంపొందించడం ప్రత్యేక సంస్థ కీలక కార్యాచరణలో భాగం. ఈ ప్రాంతం సాంస్కృతిక, భాషా గుర్తింపును బలోపేతం చేయడంపై కూడా కమిటీ దృష్టి సారిస్తుంది. ఈ కమిటీలో రెవెన్యూ, హోం, షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాలు అభివృద్ధి, గ్రామీణ అభివృద్ధి, కార్మిక, ఆహార సరఫరాలు, ఒడియా భాష, సంస్కృతి, న్యాయ, విద్య, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, ఇతర కీలక విభాగాల సీనియర్ అధికారుల్ని సభ్యులుగా ప్రతిపాదించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంటుతో పాటు నైరుతి శ్రేణి డీఐజీ, దక్షిణ ప్రాంత ఆర్‌డీసీ కూడా ఈ ఉన్నత స్థాయి ప్యానెల్‌లో సభ్యులుగా ఉన్నారు. రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ కమిటీ ఏర్పాటుకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అత్యంత సున్నితమైన, వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతాలలో ఒకటిగా నిలిచిన కొరాపుట్ జిల్లా పొట్టంగి మండలం కొటియా పంచాయతీ గ్రామాల సుస్థిర, సమగ్ర అభివృద్ధి నమూనాకు పునాది వేస్తూ తదుపరి చర్యల కోసం కమిటీ తన సిఫార్సులను ముఖ్యమంత్రికి సమర్పిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అక్రమ తుపాకుల తయారీ శిబిరం గుట్టురట్టు

భువనేశ్వర్: అంగుల్ జిల్లా పోలీసు అధికారులు శుక్రవారం జంబువా గ్రామంలో అక్రమ తుపాకుల తయారీ శిబిరం గుట్టు రట్టు చేశారు. అంగుల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో బేణు కిషన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఇతడు అక్రమంగా తయారు చేస్తున్న ఒక్కో తుపాకీ రూ. 5,000 నుంచి రూ. 10,000లకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. ఖమర్ పోలీసు ఠాణా పరిధి జంబువా గ్రామంలో అక్రమ తుపాకీ తయారీ యూనిట్‌ను కనుగొన్నారు. ఈ దాడిలో తుపాకీల తయారీకి ఉపయోగించే వివిధ పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇంట్లో తయారు చేసిన తుపాకీ, అనేక చేతి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. బేణు కిషన్‌ను నిందితునిగా పరిగణించి అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ దాడిని అంగుల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) పర్యవేక్షించారు. దర్యాప్తులో ఒక్కో తుపాకీని రూ. 5,000 నుంచి రూ. 10,000 అమ్ముతున్నట్లు నిందిత కిషన్ వెల్లడించాడు. ప్రాథమిక విచారణలో బేణు కిషన్ చాలా సంవత్సరాలుగా ఈ అక్రమ ఆయుధ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నాడని తేలింది. పట్టుబడిన తర్వాత నిందితుడు బేను కిషన్ నిర్దోషి అని చెప్పుకుంటూ తుపాకుల తయారీకి తనకు లైసెన్స్ లేదు, తుపాకులు తయారు చేసే విధానం మాత్రమే తెలుసు, జీవనోపాధి కోసం తుపాకుల్ని చేస్తున్నట్లు వివరించాడు. తయారు చేసిన ఒక్కో తుపాకీని రూ. 10,000 వరకు అమ్ముతున్నట్లు పేర్కొన్నాడు.



శిబిరంలో బయటపడిన అక్రమ తుపాకులు

• ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

జయపురం: రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో నిర్వహించనున్న జింక్ ఫుట్‌బాల్ అకాడమీ కోసం జయపురం విక్రమ క్రీడా మైదానంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 17 మంది బాలబాలికలు ఎంపిక చేశారు. క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు తరుణరాయ్, కె.రామ సుబ్రహ్మణ్యంరావు, సబ్ డివిజన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రబినాయిక్, సంజయకుమార్ జెనా, ఉమేష్ ఓంకార్, సంతున్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు వినూత్న బెయిల్ షరతు

- 2 నెలల పాటు బ్యాంకును శుభ్రం చేయాలని ఆదేశం

భువనేశ్వర్: బ్యాంకు మోసాలకు పాల్పడిన నిందిత మహిళకు రాష్ట్ర హైకోర్టు వినూత్న షరతుతో బెయిలు మంజూరు చేసింది. ఉల్లంఘనకు పాల్పడితే బెయిలు రద్దవుతుందని స్పష్టం చేసింది. బ్యాంకు మోసం ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ మనోజ్ఞా పట్నాయక్ కటక్ నగరంలో ఐసీఐసీఐ బ్యాంక్ లింక్ రోడ్ శాఖ ప్రాంగణాన్ని 2 నెలల పాటు శుభ్రం చేయాలని ఒడిశా హైకోర్టు సంచలనాత్మక బెయిల్ షరతు జారీ చేసింది. మోసం కేసులో ఆమెకు విధించిన ఈ బెయిల్ షరతును సమాజ సేవ ద్వారా సంస్కరణపై కోర్టు దృష్టి సారించినట్లు పలు వర్గాలు కొనియాడుతున్నాయి. భువనేశ్వర్‌లోని ఇండియన్ బ్యాంక్ నుంచి గతంలో రుణం పొందడానికి ఉపయోగించిన ఆస్తిని మళ్లీ తనఖా పెట్టి అడ్డగోలుగా రుణం పొందింది. ఆ అప్పును తిరిగి చెల్లించడంలో విఫలమైనందుకు నిందిత మనోజ్ఞా పట్నాయక్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 5న క్రైమ్ బ్రాంచ్ అరెస్టు చేసింది. ఈ కేసు విచారణలో హై కోర్టు బెయిల్ మంజూరు చేస్తు ఆమె ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బ్యాంకు ఆవరణను శుభ్రం చేయాలని ఆదేశించింది. నిబంధనలు పాటించకపోతే ఆమె బెయిల్ రద్దవుతుందనే షరతు విధించింది.

27న కోయిపూర్‌లో గ్రీవెన్స్‌సెల్

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ కోయిపూర్‌లో ఈ నెల 26న జరగాల్సిన జాయింట్ గ్రీవెన్స్‌సెల్‌ను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసినట్టు కలెక్టర్ బిజయకుమార్ దాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సోమవారం సావిత్రీ అమావాస్య పండుగకు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. గతంలో స్పందన వినతులు ఇచ్చిన వారు తిరిగి పంపించవద్దని కోరారు.

న్యాయ సేవలపై అవగాహన



శిబిరంలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు

జయపురం: జాతీయ న్యాయ సేవా, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల ఆదేశం మేరకు కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుల సూచన మేరకు శుక్రవారం సాథీ (స్నేహ) సంఘటన ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా ప్రదీకరణ సభాగృహంలో న్యాయ పరిచయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 18 ఏళ్ల వయసు లోపు వారికి సాక్షరత, సురక్ష, లేక ఉన్నవారు, రోడ్లపై, పట్టణాలలో, రైల్వే స్టేషన్లలో అనాథాలుగా ఉంటున్న శిశువుల రక్షణ, త్యజింపబడిన పిల్లలు, లేదా తల్లిదండ్రులు వదలివేసిన పిల్లలు, భిక్ష మెత్తుకుంటున్న బాల కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయవాది దివాకరరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి, శాశ్వత లోక్ అదాలత్ విచారపతి, జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యుమయ సుజాత, జిల్లాలోని ఏడుగురు తహసీల్దార్లు, జిల్లా వైద్యాధికారి, జిల్లా సమాజ సంక్షేమ అధికారి, జిల్లా శిశు సుర్క్షా అధికారి, అదనపు జిల్లా విద్యాధికారి, కిశోర్ విభాగ పోలీసు అధికారి, ఐదుగురు శిశు పరిశీలనఅధికారులు, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ప్యానెల్ న్యాయవాది, పారాలీగల్ స్వచ్ఛంద సేవకులు పాల్గొనివారి అభిప్రాయాలను వెల్లడించారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులు ప్రారంభం



చికిటి కాలనీలో కాలువలో పూడిక తీస్తున్న దృశ్యం



కొత్తవీధిలో కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

జయపురం: వర్షాకాలం దగ్గర పడుతుండటంతో పట్టణ పారిశుధ్యంపై జయపురం మున్సిపాలిటీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు ప్రారంభించారు. వర్షం పడితే పట్టణంలోని చిన్న కాలువలతో పాటు పెద్దకాలువలు పారక నీరు రోడ్లపైకి వచ్చేస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇప్పటికే పలు డ్రైన్‌లు చెత్తలతో పేరుకు పోయి కనిపిస్తున్నాయి. వాటిని పరిశుభ్రపరచక పోతే దోమలకు ఆలవాలమై మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి నుంచి ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ అధికారులు ముందుగానే చర్యలు చేపట్టారు. జేసీబీల ద్వారా కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్య రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోస్టర్లు అతికిస్తే కఠిన చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న జయపూర్ సబ్ కలెక్టర్ అక్కవరం సశ్యా రెడ్డి



ఓఎస్ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద పోస్టర్లు చించుతున్న సిబ్బంది

కొరాపుట్/ జయపురం: పబ్లిక్ ఆస్తులు, స్థలాల్లో ప్రైవేటు కాలేజీల పోస్టర్లు, ఫ్లెక్సీలు అతికిస్తే చర్యలు తప్పవని జయపురం సబ్ కలెక్టర్, మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి అక్కవరం సస్యా రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో వెళ్లి పోస్టర్లు తొలగింపజేశారు. అనుమతులు లేకుండా బేనర్లు, వాణిజ్య ప్రకటనలు ఏర్పాటు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలు, విద్యుత్ స్తంభాలు, బస్సు స్టాప్‌లకు పోస్టర్లు అతికిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువలు బోధించాల్సిన కొన్ని కళాశాలలు వాటిని విస్మరిస్తూ తమ ప్రకటనలను ఇష్టారాజ్యంగా అంటించడం తగదని పేర్కొన్నారు.

బృందావన ప్యాలెస్‌లో చోరీ

పర్లాకిమిడి: మహేంద్రతనయ నడి ఒడ్డున ఉన్న బృందావన ప్యాలెస్‌లో స్వాగత ద్వారం వద్ద మెట్లకు ఉన్న ఐరన్ రెయిలింగ్‌ను దుండగులు దొంగిలించారు. దీనిపై పర్లాకిమిడి ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 148 ఏళ్ల కిందట మైసూర్ నుంచి తీసుకువచ్చి బీఎస్ ప్యాలస్ మెట్లకు ఐరన్ రెయిలింగ్ ఏర్పాటుచేశారు. స్వర్గీయ పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి వేసవి విడిదికి ఈ బృందావన్ ప్యాలస్‌ను నిర్మించారు. ఇక్కడే బ్రిటిష్ పాలకులకు విందులు, సమావేశాలు జరిపేవారట. తదనంతరం కృష్ణచంద్రగజపతి నారాయణదేవ్ కుమారుడు రామచంద్రగజపతి కొన్నాళ్లు వేసవి విడిది చేశేవారు. తదనంతరం గజపతి జిల్లాలో ఆంధ్రా ఒడిషా రాష్ట్రాల సరిహద్దు శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం పట్టుపురంలో ఒక జమీందారును పీపుల్స్ వార్ గ్రూప్ దళం తలను నరికి చంపింది. ఈ సంఘటన అనంతరం సీఆర్పీఎఫ్ జవాన్లను కేంద్రం మోహరించింది. ఆ సమయంలో ప్యాలెస్‌లో విలువైన ఫౌంటైన్‌లు, విదేశాల నుంచి తీసుకువచ్చిన టైల్స్, పాలరాతి బొమ్మలు మాయమయ్యాయి. ఇప్పుడు అసాంఘిక కార్యక్రమాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం బీఎస్ ప్యాలెస్‌ను సంరక్షించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో బృందావన్ ప్యాలెస్ పై అంతస్తు



ప్యాలెస్‌లో చోరీకి గురైన మెట్ల ఐరన్ రెయిలింగ్

క్లుప్తంగా

ఎవరి కన్న బిడ్డో..!



పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాబును వదిలివెళ్లిన అపరిచితులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి వద్ద గల 'క్రెడేల్ బేబీ పాయింట్' వద్ద ఏడాది మగ శిశువును ఎవరో వదిలి వెళ్లిపోయారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ప్రభుత్వ మెయిన్ గేటు వద్ద ఏర్పాటుచేసిన బేబీ పాయింటు వద్ద బాబును వదిలి వెళ్లడంతో బాబు ఏడుపు మొదలు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా స్వతంత్ర దత్తత కేంద్రం బృందం విచ్చేసి మెడికల్‌లో అన్ని వార్డులు ఎంక్వైరీ చేసినా బాబు తల్లిదండ్రులు కనిపించకపోవడంతో బాబును చేరదీసి ఆరోగ్యం పరీక్షించారు. తదనంతరం జిల్లా దత్తత కేంద్రం (రాణిపేట) కు తరలించినట్టు జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి తెలియజేశారు. పోషించలేని తల్లి వదిలి వెళ్లడానికి మెడికల్ వద్ద క్రెడేల్ బేబీ పాయింటు వద్ద బెల్ కూడా ఉంది. కానీ దాన్ని ఉపయోగించలేదని అధికారులు తెలియజేశారు.

రోడ్డు పనులపై మండిపాటు



ఏడీఎం ఫాల్గుణ మఝితో మాట్లాడుతున్న నాయకులు

పర్లాకిమిడి: పి.డబ్ల్యూ.డి. రోడ్లు-భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి కొత్త బస్టాండ్ వరకూ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు, అధికారుల తీరుపై స్థానికులు మండిపడ్డారు. ఈ మేరకు బీజేపీ శ్రేణులతో కలిసి అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫాల్గుణ మఝికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడు గ్రామంలో కాలారి నారాయణరావుకు చెందిన సుమారు రూ. 80 వేలు విలువ చేసే చూడి ఆవు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వ్యవసాయ మోటారుకు వెళ్లే విద్యుత్ లైన్ ట్రాన్సఫార్మర్ గ్రామం మధ్యలో కిందకు ఉండడం వల్ల ఆవుకు విద్యుత్ షాక్ కొట్టిందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఫుడ్ పాయిజన్‌తో రెండు గేదెలు మృతి

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన బెందాళం గణపతి అనే రైతుకు చెందిన రెండు ముర్రా జాతి గేదెలు శుక్రవారం ఉదయం హఠాత్తుగా మృతిచెందాయి. ఎప్పటిలాగే ఉదయం ఆహారంగా పాలిష్ తౌడు కలిపి పెట్టారు. ఆహారాన్ని తింటూ అనారోగ్యానికి గురయ్యాయి. దీంతో అప్పటికప్పుడే మృతిచెందినట్లు రైతు గణపతి వాపోయాడు. రోజుకు 5 లీటర్లు చొప్పున పాలు ఇచ్చేవని రైతు తెలిపాడు.

తప్పిన పెనుప్రమాదం



వాండ్రంగి వంతెనపై ప్రమాదానికి గురైన కారు

జి.సిగడాం: వాండ్రంగి రైల్వే వంతెనపై అతివేగంతో వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జైపోయింది. స్థానిక ఎస్ఐ వై.మధుసూదనరావు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాగోలు సమీపంలో ఉన్న గూడెం గ్రామం నుంచి రాకేష్ అనే వ్యక్తి కారుతో రాజాం వైపు వెళ్తున్నాడు. రైల్వే వంతెనపై ముందు ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో కారు ముందు భాగం ధ్వంసమైపోయింది. రాకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. 108 సాయంతో ఆయనను పొందూరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విషం తాగి యువకుడు మృతి

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పంచాయతీలో గల లోచర్లపాలెం గ్రామానికి చెందిన సింక శ్యామలరావు(29) విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్యామలరావు గురువారం సాయంత్రం లోచర్లపాలెం గ్రామ సమీపంలో విషం తాగేశాడు. అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో స్థానికులు కొండములగాం ప్రభుత్వాస్పత్రిలో చేర్పారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని అన్నయ్య వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లింగరాజ్ ఆలయంలో విదేశీ పర్యాటకుడు

- ఆచారాలకు విఘాతం

భువనేశ్వర్: ఏకామ్ర క్షేత్రం లింగరాజ్ ఆలయంలో ఒక విదేశీ పర్యాటకుడు ఫొటోలు తీస్తూ కనిపించాడు. అతడిని రొమేనియాకు చెందిన వాసిలాచే అంద్రీ క్రిస్టియన్‌గా గుర్తించారు. శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. ఆలయ ప్రాంగణం అచ్యుత కహాండ ప్రాంతంలో అతని అనుమానాస్పద ప్రవర్తనను గమనించిన ఆలయ పోలీసులు, సేవకులు అతడిని ప్రశ్నించారు. వెంటనే అతడిని ఆలయం నుంచి ఆలయ కార్యాలయానికి తరలించి విచారించారు. ఈ విచారణలో అతడు క్రైస్తవ మతస్తుడిగా గుర్తించారు. విదేశీ పర్యాటకుడిని అదుపులోకి తీసుకుని పత్రాలు, పాస్‌పోర్ట్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

హిందుయేతరులు ఆలయంలోకి ప్రవేశించడం నిషిద్ధం. విదేశీయుడు ఆలయంలోకి ప్రవేశించడంతో ఆలయ ఆచారాలకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో సంప్రదాయం ప్రకారం ఆలయాన్ని సున్నపు నీటితో శుద్ధి చేశారు. దీంతో రోజువారీ పూజలు దాదాపు మూడున్నర గంటలు ఆలస్యమయ్యాయి. ఈ సందర్భంగా లింగరాజు మహా ప్రభువు కోసం తయారు చేసిన ప్రసాదం అపవిత్రమైనట్లు ప్రకటించి 'అముణియా' కొలనులో వేశారు. మూల విరాట్‌ను కూడా మహా స్నానం చేయించి మరోసారి అలంకరించారు.



వాసిలాచే అంద్రీ క్రిస్టియన్

ఈ సంఘటన ఆలయ సేవకులలో, అధికారులలో తీవ్ర కలకలం రేపింది. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సేవకులు డిమాండ్ చేశారు. 2012 సంవత్సరంలో రష్యన్లు హిందూ మతంలోకి మారినట్లు చెప్పుకున్న వ్యక్తి లింగరాజ్ ఆలయం లోనికి ప్రవేశించడంతో ఇలాంటి గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతకు ముందు 2009 సంవత్సరం మార్చి నెలలో జరిగిన మరో సంఘటనలో పోలండ్‌కు చెందిన హిందూ ఎన్నారై బాలుడు రిస్జార్డ్ అంకుర్ అహుజా విదేశీయుడిలా కనిపించడంతో లింగరాజ్ ఆలయంలోకి ప్రవేశించకుండా ఆపారు.

టీడీపీ నాయకులకు భలే 'ఉపాధి'



కాపుగోదాయవలసలో ఉపాధి పని చేస్తున్న వేతన దారులు

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుని జేబులు నింపుకుంటున్నారు. కాపుగోదాయవలస గ్రామంలో జరుగుతున్న తంతు గమనిస్తే అధికార పక్ష నేతల తెలివి అర్థమవుతుంది. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పనికి రాకుండానే స్థానిక టీడీపీ నాయకుల పేర్లు మస్టర్లలో నమోదు చేసి డబ్బులను దోచుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ దొంగ మస్టర్లు వేస్తూ చేతివాటం చూపిస్తున్నాడు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుత్తమ శివప్రసాద్ (జాబ్ కార్డు నంబర్ 010220) ఉపాధి పనికి వెళ్లకుండానే 36 రోజుల పాటు ఆయన పేరిట మస్టర్‌ను నమోదు చేసి తొమ్మిదివేల రూపాయలు అకౌంట్‌లో వేసుకున్నారు. సైనా భీష్మారావు, అతని భార్య ఈశ్వరమ్మ (జాబ్ కార్డు నెంబర్ 010153) పేరున కలిపి సుమారు 72 రోజులు మస్టర్లు నమోదు చేసి సుమారు రూ.18వేలు లాగేశారు. దున్న చంద్రయ్య, అతని భార్య నరసమ్మ (010122) పేరున 42 రోజులు మస్టర్లు నమోదు చేసి సుమారు రూ. 14వేలు వారి ఖాతాలో జమ చేసుకున్నారు. వాడరేవు తారకేశ్వరరావు (జాబ్ కార్డు నంబర్ 10313), కారాడ ప్రభ (జాబ్‌కార్డు నంబర్ 010262) పేరున మస్టర్లు నమోదు చేసి వారి అకౌంట్లోనూ డబ్బులు వేసుకున్నారు. టీడీపీ నాయకుడు కుత్తమ శివప్రసాద్ అక్క సైనా ఉమాదేవికి (జాబ్ కార్డు నంబర్ 010174) సుమారు 70 ఏళ్లు ఉంటాయి. ఆమె కిడ్నీ పేషెంట్. అయినా ఆమె పేరున కూడా 36 రోజులు మస్టర్లు నమోదు చేసి తొమ్మిది వేలు పైచిలుకు డ్రా చేశారు. ఇలా టీడీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యుల పేర్లతోనే కాకుండా వలస వెళ్లిన వారు, విదేశాల్లో ఉన్న వారి పేర్లతో కూడా మస్టర్లు నమోదు చేస్తున్నారని ఉపాధి వేతన దారులు ఆరోపిస్తున్నారు. చింతల ట్యాంక్, చింతలచెరువు, జగన్నాథసాగరం, యర్రా ట్యాంక్ చెరువుల్లో పనిచేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ నమోదు చేశారు. నిరుపేదలకు వెళ్లాల్సిన డబ్బులు ఇలా టీడీపీ నాయ కులు వారి బంధువుల ఖాతాల్లోకి వెళ్లడంపై వేతన దారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు



పాత జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. శ్రీకాకుళం వైపు వెళుతున్న ఆటో ప్రయాణికులను ఎక్కిస్తుండగా వెనుక నుంచి మరో ఆటో వచ్చి ఢీకొట్టింది. దీంతో ఢీ కొట్టిన ఆటో బోల్తా పడగా.. ముందు ఉన్న బండి ఓ వైపునకు ఒరిగిపోయింది. రెండు ఆటోల్లో పది మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. వారిలో లక్ష్మమ్మ, భాగ్యవతి, అమ్మన్నమ్మ, శోభామణి గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిది పొందూరు మండలం తాడివలస గ్రామం.

రెడీగా భవనాలు.. అయినా మీనమేషాలు



రిమ్స్ కాలేజీ హాస్టల్ భవనాలు

- పూర్తయిన భవనాలు స్వాధీనం చేసుకోని రిమ్స్ అధికారులు
- వసతికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- క్యాంటీన్ లేక అవస్థలు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో పలు భవన నిర్మాణాలు పూర్తయినా సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవడం లేదు. 200 మందికి సరిపడా హాస్టల్ భవనం నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర అవుతున్నా రిమ్స్ అధికారులు ఇప్పటికీ భవనాన్ని స్వాధీనం చేసుకోలేదు. ఏపీ హెచ్ఎంహెచ్ఐడీసీ అధికారులు ఎన్ని సార్లు లేఖలు రాసినప్పటికీ వసతి గృహ నిర్వహణకు అవసరమైన సామగ్రి లేదని తిరుగు టపాలో రిమ్స్ అధికారులు లేఖలు రాస్తున్నారు. ఈ భవనాలను ఇలాగే వదిలేయటంతో మరుగుదొడ్లు, వాష్ బేసిన్ల వద్ద బిగించి ఉన్న 300కు పైగా కుళాయిలు చోరీకి గురయ్యాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ లబోదిబోమంటూ భవనాన్ని స్వాధీనం చేసుకునే సమయంలో కుళాయిలను మరోసారి అమర్చుతానని తెలిపారు. రిమ్స్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులు 650 మంది, పీజీ విద్యార్థులు 650 మంది, హౌస్ సర్జన్లు 150 మంది వరకు ఉన్నారు. వీరికి సరైన వసతి సౌకర్యం లేకపోవటం వల్ల 275 మంది ప్రైవేటుగా అద్దె గదుల్లో ఉంటూ చదువుతున్నారు. 275 మందిలో 117 మంది మహిళలు కాగా 158 మంది పురుషులు ఉన్నారు. పీజీ విద్యార్థుల సంఖ్య 180 మంది కాగా వీరిలో 115 మంది ప్రైవేటుగా అద్దె భవనాల్లో ఉండి చదువుతున్నారు. వసతి గృహాల్లో ఉన్నవారు కూడా ఒక్కో గదిలో 5 నుంచి 10 మంది వరకు ఉండి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇవేమీ రిమ్స్ అధికారులకు పట్టడం లేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

రిమ్స్ అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఇటీవలి రిమ్స్‌లో పర్యటించిన కలెక్టర్ తాగునీటి ఆర్వో ప్లాంట్, లిఫ్టులు పనిచేయకపోవటాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. ఈ విషయాలను తనకు ఎందుకు తెలియజేయలేదని అధికారులపై మండిపడ్డారు. మరమ్మతులు చేపట్టాలని సూచించి రెండు నెలలు దాటుతున్నా పట్టించుకోలేదు. సలహా మండలి సమావేశాలు కూడా నిర్వహించటం లేదు. ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

క్యాంటీన్‌దీ ఇదే పరిస్థితి..


రిమ్స్ ఆవరణలో క్యాంటీన్ భవన నిర్మాణం కూడా పూర్తయి నాలుగు నెలలకు పై బడుతుంది. దీన్ని కూడా రిమ్స్ అధికారులు స్వాధీనం చేసుకోలేదు. ఎవరికి వారు తమకెందుకులే అనే పద్ధతిలో ఉన్నారు. హాస్టల్స్‌లో భోజనాలు సరిగా లేవన్న పంచాయతీ కలెక్టర్ వరకు వెళ్లిన విషయం పాఠకులకు తెలిసినదే. కనీసం క్యాంటీన్ ఉన్నా అక్కడైనా భోజనం చేసుకుంటామని విద్యార్థులు భావిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రిమ్స్‌లో ఉన్న సమస్యలు అన్ని వర్గాల వారి నుంచి తెలుసుకుంటున్నాను. ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాను.

– డాక్టర్ అమూల్య, సూపరింటెండెంట్, రిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం

మా కేశవుడు అంత పెద్దోడా..



- ఇప్పుడెలా ఉంటాడోనని ఆశగా ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు
- నంబాళ్ల కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి
- మృతదేహం కోసం వెళ్లి వెనక్కి వచ్చేసిన కుటుంబ సభ్యులు
- కేంద్రం తీరును దుయ్యబడుతున్న ప్రజా సంఘాల నేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'మావోడు అంత పెద్దోడా.. పోలీసు కాల్పుల్లో మరణించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా స్పందించారంటే అంత ఎత్తుకు ఎదిగిన నాయకుడా? పత్రికల్లో, టీవీల్లో చూస్తుంటే మా కేశవరావు స్థాయి ఏంటో తెలుస్తోంది. ఇక్కడ చదువుకున్నంత కాలం అందరితో సరదాగా ఉండేవాడు. రోజూ వ్యవసాయం చేసేవాడు. బాగా చదువుకునే వాడు. కబడ్డీ బాగా ఆడేవాడు. అలాంటి వ్యక్తి వరంగల్‌లో ఇంజినీరింగ్‌లో చేరాక.. ఏం జరిగిందో తెలియదు గాని నక్సలిజంలోకి వెళ్లిపోయాడు. దేశంలో ఉద్యమ శిఖరంగా, మావోయిస్టుల సుప్రీం కమాండర్‌గా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారంటే ఆశ్చర్యంగా ఉంది. 45 ఏళ్ల కిందట ఊరి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పుడెలా ఉంటాడో తెలియదు. పేపర్లలో ఫొటోలు చూసి ఈయనే కేశవరావా అనుకోవాల్సి వస్తోంది. మృతదేహం సొంతూరికి వస్తే తప్ప కేశవరావును కళ్లారా చూసే అవకాశం లేదు. చివరి చూపు లేకపో తే ఆయన ఎలా ఉంటాడో నేటికీ తెలుసుకోలేని పరిస్థితిలో మేమంతా ఉన్నాం.' **ఇదీ మావోయిస్టుల అగ్రనేత నంబాళ్ల కేశవరావు స్వగ్రామం జియ్యన్నపేటలో వ్యక్తమవుతున్న అభిప్రాయం.**

ఈ గ్రామంలో కేశవరావుకు సంబంధించి దాదాపు 15 కుటుంబాలు ఉన్నాయి. ఆయన చిన్నతనంలో కలిసి తిరిగిన వ్యక్తులు ఉన్నారు. వరసకు సోదరుడైన నంబాళ్ల సూరయ్య, మరికొంతమంది వ్యక్తులు కేశవరావు బాల్యం గురించి చెబుతున్నారు. కష్టపడి వ్యవసాయం చేయడమే కాకుండా బాగా చదివేవాడని, కబడ్డీ మంచిగా ఆడేవాడని, ఈ మూడు తప్ప కేశవరావుకు ఇంకేమి తెలియవని, అలాంటి వ్యక్తి వరంగల్ వెళ్లాక ఉద్యమం బాట పట్టారని చెబుతున్నారు. తర్వాత గ్రామస్తులు, కుటుంబీకులు ఇబ్బంది పడకూడదని ఊరికి రాక పోయి ఉంటాడని అంటున్నారు. వీరంతా కేశవరావు బాల్యం కోసం చెబుతున్నారే తప్ప ఇప్పుడెలా ఉంటారో గుర్తించలేమంటున్నారు. ఆయన ఆనవాళ్లు ఎలా ఉంటాయో చెప్పలేమంటున్నారు. మరి కొందరైతే 45 ఏళ్ల కిందట ఊరు వదిలి వెళ్లిపోయిన కేశవరావును తర్వాత ఎప్పుడూ చూడలేదని, విశాఖపట్నంలో జైలులో ఉన్నప్పుడు తన తండ్రితో పాటు కొందరు కలిశారని, ఉద్యమంలోకి వెళ్లొద్దని చెప్పినట్టు కూడా ప్రచారం ఉందని అంటున్నారు. మా కేశవరావు ఇప్పుడెలా ఉంటాడో చూడాలని ఉందని, చనిపోయాకైనా చూసిన భాగ్యం కలుగుతుందని అంటున్నారు. గతంలో కూడా రెండు మూడు పర్యాయాలు కేశవరావు చనిపోయారని వార్తలు వచ్చాయని, కానీ నిజం కాదని తర్వాత తర్వాత తెలిసిందని అంటున్నారు. ఇప్పుడే కంగా ప్రధానమంత్రి, హోంమంత్రి కేశవరావు చనిపోయాడని స్టేట్‌మెంట్ ఇచ్చారని, అసలేం జరిగిందో తెలియకపోయినా మృతదేహాన్ని ఇస్తే కళ్లారా చూసి, సంప్రదాయ ప్రకారంగా అంత్యక్రియలు చేసుకుంటామని అంటున్నారు. కాకపోతే, తమ పేర్లు రాయవద్దని గతంలో ఇలాగే మీడియాతో మాట్లాడితే విచారణకని విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తిప్పారని, ఇప్పుడు తమకు ఇదంతా అవసరమా అని అంటున్నారు. ప్రస్తుతానికైతే మృతదేహం కోసం గ్రామం ఎదురు చూస్తోంది.



కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి

జియ్యన్నపేటలో తాళం వేసి ఉన్న కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి ఎక్కువైంది. జిల్లా నుంచే కాదు మిగతా ప్రాంతాల నుంచి పలు సంఘాల నాయకులు వచ్చి చూస్తున్నారు. చుట్టు పక్కల ఉన్న వారితో మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా ప్రతినిధుల వద్ద భుక్తి కోసం, భూమి కోసం చేసిన పోరాటంలో శిఖరంగా కేశవరావు నిలిచాడని, దోపిడీ రూపం మార్చుకుందే తప్ప పూర్తిగా పోలేదని, చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందామని మావోయిస్టులు కోరుతున్నా పట్టించుకోకుండా ఆపరేషన్ కగార్ పేరుతో హతమారుస్తుందని కేంద్ర ప్రభుత్వం తీరును దుయ్యబడుతున్నారు.

వెనక్కి వచ్చేసిన కుటుంబీకులు

కేశవరావు మరణించారని, వెళ్లి చూడొచ్చని జిల్లా పోలీసులే సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకోవచ్చని చెప్పి పంపించారు. జగదల్‌పూర్ వరకు వెళ్లాక ప్రొసీజర్ అవ్వలేదని, ప్రస్తుతానికి మృతదేహం ఇవ్వడం కుదరదని అక్కడ పోలీసులు చెప్పేశారు. ఇంతలో పోస్టుమార్టమైతే అక్కడే ఖననం చేసేయండని, ఇక్కడికి తీసుకురావద్దని పోలీసులు చెప్పారంటూ అక్కడికి వెళ్లిన కేశవరావు సోదరుడు రామ్ ప్రసాద్ బృందం చెబుతోంది. మృతదేహాన్ని తీసుకొస్తే దేశం నలుమూలల నుంచి విప్లవ సంఘం నాయకులు, అభిమానాలు వస్తారని, వారి ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుందని, ఉద్యమాల పుట్టిన గడ్డపై మళ్లీ కొంత పుంతలు తొక్కుతుందేమో అన్న అనుమానంతో అడ్డుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పలాసలో ఉద్రిక్తత



కాశీబుగ్గ బస్టాండ్ వద్ద నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: నంబాళ్ల కేశవరావుతో పాటు 27 మంది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపారని శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు పలువురు నిరసన తెలిపారు. కాశీబుగ్గలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం పది గంటలకు శాంతిపూర్వక నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాశీబుగ్గ సీఐలు సూర్యనారాయణ, తిరుపతిరావులు తమ సిబ్బంది వచ్చి వారిని అడ్డుకున్నారు. సుమారు 15 మందిని అదుపులోకి తీసుకుని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో కాశీబుగ్గ బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, లిబరేషన్ పార్టీ నాయకులు, పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు, అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజాకళామండలి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో నిరసన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది.

'తెలుగుభాషకు వెన్నుపోటు పొడుస్తారా..?'

శ్రీకాకుళం న్యూకాలనీ: తెలుగు భాషకు వెన్నుపోటుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సర్కారు పాఠశాలల్లో తెలుగు మీడియంను రద్దు చేస్తుండటం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయుల కేటాయింపు లేకపోవడంపై భాషోపాధ్యాయులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలను అందజేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగుభాషా బోధనకు ఉపాధ్యాయులు లేకుండా చేస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు వెలువరించడం బాధాకరమని, ఇది ఎంతమాత్రం ప్రభుత్వానికి తగదని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) శ్రీకాకుళం జిల్లా శాఖ నాయకులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు నేతృత్వంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కలిసి విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా 2001 నుంచి విస్తృతంగా ప్రాథమికోన్నత పాఠశాలలు నెలకొల్పిన నాటి నుంచి 2025 వరకు సబ్జెక్ట్ టీచర్లకు కొరత లేకుండా బోధన జరిగిందని వారు కేంద్రమంత్రికి వివరించారు. కానీ ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ తాజాగా జారీ చేసిన రేషనైలేజేషన్ జీఓలో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడి పోస్టును లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాల విద్యా శాఖ తీసుకొచ్చిన హేతుబద్ధీకరణ జీఓలో మార్పులు చేసి, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పోస్టును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు. ఇవే సమస్యలను ప్రస్తావిస్తు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కూడా వినతి పత్రం అందజేశారు. ప్రజాప్రతినిధులను కలిసిన వారిలో వసంత్, రంగనాయకులతోపాటు గొడబ మేరీప్రసాద్, చింతపల్లి జనార్దనరావు, మజ్జి వెంకటరమణ, అరసవిల్లి గణపతిరావు, మజ్జి వెంకట రమణ తదితరులు ఉన్నారు.

రామ్.. సలామ్..!



నీ కీర్తి.. మాకు స్ఫూర్తి



మేజర్ రామ్

- కీర్తి చక్ర పురస్కారం అందుకున్న మేజర్ మళ్ల రామ్‌గోపాల నాయుడు
- సంబరపడుతున్న జిల్లా వాసులు
- అద్భుత సాహసంతో ఉగ్రవాదులను మట్టుబెట్టినందుకు పురస్కారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, సంతబొమ్మాళి:

సిక్కోలు సంబరపడింది. జిల్లాకు చెందిన మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడు గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా దేశ రాజధానిలో 'కీర్తి చక్ర' అవార్డును అందుకున్నారు. ఈ క్షణాలు చూసి జిల్లా యావత్తు మురిసిపోయింది. ఈయన స్వగ్రామం సంతబొమ్మాళి మండలంలోని నగిరిపెంట గ్రామం. 2023 అక్టోబర్ 26న జరిగిన ఓ ఆపరేషన్‌లో మేజర్ రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆ పోరాటాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందించారు. రామ్‌గోపాల నాయుడు తల్లిదండ్రులు నగిరి పెంటకు చెందిన రైతు మళ్ల అప్పలనాయుడు, హేమమాలిని. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన రామ్ 2012లో యూపీఎస్సీ నిర్వహించిన స్టాఫ్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఎగ్జామ్ రాసి పూణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికయ్యారు. అక్కడ మూడేళ్లు అభ్యసించి, 2015-16లో డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీలో క్యాడెట్‌గా చేరారు. అక్కడ శిక్షణ తీసుకున్న 900మందిలో గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచి, ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. లెఫ్టినెంట్‌గా పనిచేసిన రెండేళ్లలో(2018)నే కెప్టెన్‌గా పదోన్నతి సాధించారు. అక్కడికి నాలుగేళ్లలో (2022)లో మేజర్‌గా ప్రమోషన్ లభించింది.


ఆ రోజు ఏం జరిగిందంటే..?

2023 అక్టోబర్ 26 ఉదయం 10.10గంటలకు ఐదుగురు ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని ఓ జవాన్ ద్వారా తెలుసుకున్నారు. 10.25 గంటలకు రంగంలోకి దిగిన రామ్‌గోపాలనాయుడు తోటి జవాన్లకు మార్గనిర్దేశం చేసి, ఉగ్రవాదులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. తన దళాలకు ప్రమాదాన్ని గ్రహించి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరొక ఉగ్రవాదిని గాయపరిచినప్పటికీ ఆ ఉగ్రవాది భారీ కాల్పులు జరిపాడు. ఆ భీకర కాల్పుల మధ్య జవాన్లతో కలిసి ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఓ ఉగ్రవాది ఒక గుహలో దాగి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఆర్మీ బృందంపై గ్రెనేడ్ కూడా విసిరాడు. దాని నుంచి తప్పించుకుని భయపడకుండా ఆ ఉగ్రవాదిని పట్టుకుని హతమార్చారు. తన పోరాటంలో భాగంగా జవాన్లను కాపాడుకోవడం కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న మేజర్ రామ్‌గోపాల నాయుడు

దేశంలోనే గుర్తింపు వచ్చింది



ఆర్మీ మేజర్ రామ్‌గోపాల్ నాయుడు వల్ల దేశంలోనే మా గ్రామానికి గుర్తింపు వచ్చింది. ఉగ్రవాదులను అంతం చేయడంలో ధైర్య సాహసాలను ప్రదర్శించారు. కీర్తి చక్ర అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోవడం మా అందరికీ గర్వంగా ఉంది. – ఎం.రాజు, నగిరిపెంట గ్రామం, సంతబొమ్మాళి మండలం

సంతోషంగా ఉంది



మా గ్రామానికి నిజమైన పండగ వచ్చింది. మేజర్ రామ్‌గోపాల్ నాయుడు వల్ల మా గ్రామానికి ప్రత్యేకత వచ్చింది. కీర్తి చక్ర అవార్డు అందుకోవడం మాకు సంతోషంగా ఉంది.

– ఎం.సోమేశ్వరరావు, నగిరిపెంట గ్రామం

స్ఫూర్తిగా తీసుకోవాలి..



మేజర్ రామ్‌గోపాల్ నాయుడును యువత స్ఫూర్తిగా తీసుకోవాలి. కీర్తి చక్ర అవార్డు అందుకున్న రామ్‌గోపాల్‌నాయుడు మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణం.

– ఉల్లాస లోకేశ్వరరావు, రిటైర్ నాయక్ సుబేదార్

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాల అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పార్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శంబర కృష్ణ, సాయికిరణ్, అచ్యుత శర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇంచార్జ్ ఈవో కెఎన్‌విడివి.ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్: ఐసీడీఎస్ పరిధిలోని వన్‌స్టాఫ్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి కలెక్టరేట్‌లో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మల్టీ పర్పస్ స్టాఫ్ కమ్ కుక్ ఫోస్టు -1, పారా లీగల్ పర్సనల్ పోస్టు - 1కి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారా లీగల్ పోస్టుకు ముగ్గురు, మల్టీపర్పస్ స్టాఫ్‌కు 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు అయిన సివిల్ సప్లయిస్ డీఎం బి.శాంతి, డీపీవో టి.వెంకటేశ్వరావు, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరసింహ మూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కొత్తవలస సమీపంలో ఏనుగులు



కొత్తవలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండల కేంద్రం సమీపంలోని కొత్తవలస గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచారిస్తూ కనిపించాయి. దీంతో చినఖేర్జిల, నయా బంజుకుప్ప, బూర్జివలస తదితర గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు. కొమరాడ నుంచి ఖేర్జిల వైపు వెళ్లే ప్రయాణికులు ఏనుగుల సమాచారాన్ని తెలుసుకుని వెళ్లాలని కోరారు. ఏనుగుల సంచార గ్రామాల్లో ప్రజల బయటకు రావొద్దని సూచించారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.14 లక్షల ఆర్థిక సాయం

విజయనగరం అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం సీఎం సహాయనిధి నుంచి ఆదుకున్నారు. జిల్లాకు చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.14.08 లక్షల విలువైన చెక్కులను ఆయన తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

సంతకవిటి : మండలంలో మందరాడ గ్రామానికి చెందిన బురావెల్లి అప్పారావు(58) ఉపాధి వేతనదారుడు పనులు వద్ద వడదెబ్బకు గురై మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 22న మందరాడలోని పెద్దచెరువులో ఉపాధి పనులు నిమిత్తం వెళ్లిన ఆయన మధ్యాహ్నం 5 గంటల సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. ఒంట్లో అలసటగా ఉండడంతో తన భార్య ఆదమ్మకు చెప్పి అక్కడే కూర్చుండిపోయాడు. వెంటనే ఆమె తన భర్తకు ప్రాథమిక చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చి ఆర్‌ఎంపీ వైద్యున్ని తీసుకొచ్చింది. ఇంతలోనే అప్పారావు మృతి చెందాడు. ఆరోగ్యంగా తిరిగాడే తన భర్త మృతి చెందడంతో ఆదమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. పొట్ట కూటి కోసం ఉపాధి పనులకు వెళ్తే వడదెబ్బకు తన భర్త గురయ్యాడని రోదిస్తుంది. అప్పారావు ఉపాధి పనులకు వచ్చి అస్వస్థతకు గురయ్యాడని, ఆ కుటుంబానికి ఉపాధి పథకం ద్వారా సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలల ప్రతిభకు వేదిక బాలభవన్

- వేసవిలో ఉచిత శిక్షణకు అనూహ్య స్పందన
- పలు కళల్లో తర్ఫీదు పొందుతున్న 550 మందికి పైగా చిన్నారులు
- 32 సంవత్సరాలుగా సేవలు
- వేసవి శిక్షణకూ ఇతర జిల్లాల విద్యార్థుల హాజరు



ఢిల్లీలో జాతీయ స్థాయి ప్రదర్శనల్లో బాలభవన్ విద్యార్థులు



తబలా శిక్షణ ఇస్తున్న రాజశేఖర్ మాస్టర్



తారక్ మాస్టర్ నృత్య శిక్షణ

రాజాం : రాజాంలోని మెంతిపేటలో ఉన్న బాలభవన్ బాలల ప్రతిభను వెలికితీసే వేదికగా మారింది. పలు కళా రంగాల్లో మక్కువ ఉన్న చిన్నారులకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా పేరు తెచ్చుకుంటుంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ జవహర్ బాలభవన్‌ను ఇక్కడ 1993 జూన్ 4న ప్రారంభించారు. అప్పట్లో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించిన ఈ కేంద్రం ఇప్పుడు సొంత భవనాలతో పాటు ప్రత్యేక సంస్థగా గుర్తింపు పొందింది. మ్యూజిక్, డ్యాన్స్ రంగాల్లో కేంద్రం ప్రారంభంలో ఇక్కడ శిక్షణ ఉండేది. ఇప్పుడు 16కి పైగా కళా రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పాటు వేసవిలో రాజాం వచ్చే ఇతర ప్రాంతాల విద్యార్థులకు మంచి వేదికగా ఇక్కడ బాలభవన్ వేసవి శిక్షణా తరగతులు నిలుస్తున్నాయి.

ఏమి నేర్పుతున్నారంటే..

గత నెల 24న బాలభవన్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని రాజాంకు చెందిన పలువురు ప్రముఖుల చేతుల మీదుగా డైరెక్టర్ సుంకరి రమేష్ ప్రారంభించారు. ఈ వేసవిలో ఉచితంగా చిన్నారులకు మ్యూజిక్, డ్యాన్స్, తబలా, నాట్యం, సంగీతం, ఆర్ట్స్, టైలరింగ్ వంటి విద్యలలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. శిక్షణ నిమిత్తం 550 మంది విద్యార్థులు ఈ ఏడాది ఇక్కడ చేరారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు నృత్యం, సంగీతం శిక్షణలో ఉన్నారు. ఇక్కడి విద్యార్థులు ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు పొందుతున్న సందర్భాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 200లకు పైగా బాలభవన్‌లు, 47 బాల కేంద్రాలు పని చేస్తుండగా, రాజాం బాలభవన్‌కు ప్రత్యేకత ఉంటుంది. మొత్తం 16 మంది ఉపాధ్యాయులు ఈ వేసవిలో ఇక్కడ చిన్నారులకు తర్ఫీదునిస్తున్నారు.

550 మందికి పైగా విద్యార్థులు

రాజాం బాలభవన్ వేసవి శిక్షణలో అనూహ్య స్పందన కనిపిస్తుంది. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు రకాల వినోద ప్రదర్శనల్లో తన సత్తాను చాటుతున్నారు. బాలభవన్ జాతీయ వేడుకల్లో ఇక్కడ బాలభవన్ గత 2018 నుంచి మూడు పర్యాయాలు ప్రథమ స్థానాన్ని సాంస్కృతిక కళా రంగాల ప్రదర్శనలో నిలిచింది. దీంతో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో ఇక్కడకు ఎక్కువగా విద్యార్థులు వస్తుంటారు. రాజాంలో ఉన్నవారే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉంటున్న చిన్నారులు సెలవులు కారణంగా రాజాం రావడంతో వారంతా ఈ శిక్షణలో పాల్గొని పలు కళారంగాల్లో తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు.

చాలా ఆనందంగా ఉంది..



రాజాంతో పాటు చీపురుపల్లిలో జవహర్ బాలభవన్ కేంద్రాలు ఉన్నాయి. ఎంతో కష్టపడి ఈ కేంద్రాలను నిలబెట్టాం. రాజాం బాలభవన్‌కు మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు టీవీ షోల్లో సంగీతం, నృత్యం వంటి రంగాల్లో పాల్గొనే అవకాశం పొందారు. కొంత మంది ప్రైవేట్ ఈవెంట్‌లు చేస్తూ రాణిస్తున్నారు. వేసవిలో చిన్నారులు సమయాన్ని వృథా చేసుకోకుండా కాలాన్ని ఆహ్లాదకరంగా సద్వినియోగం చేసుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ సుంకరి రమేష్, డైరెక్టర్, బాలభవన్

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుంటే స్థలాల స్వాధీనం



మాట్లాడుతున్న గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక అధికారి వెంకటరమణ

- గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక అధికారి వెంకటరమణ

విజయనగరం అర్బన్: గృహ నిర్మాణ పథకాల కింద గతంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి చేయని లబ్ధిదారులంతా వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) వెంకటరమణ సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు సహాయాన్ని వినియోగించుకొని ఆయా లబ్ధిదారులంతా తమకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లేని పక్షంలో ఆ ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసుకొని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించే నిమిత్తం గృహ నిర్మాణ సంస్థ జీఎం శుక్రవారం పలు మండలాల్లో పర్యటించారు. నెలిమర్ల మండలం సీతారాంపేట, బొంపల్లి మండలం గొట్లాం, బొబ్బిలి మండలం పారాదిలో ఇళ్ల కాలనీలను సందర్శించి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఈఈ, డీఈలతో గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్మాణాలకు ఈ సీజన్ అనుకూలంగా ఉన్నందున లబ్ధిదారులతో అధికారులు నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగించాలని సూచించారు. జిల్లాలో 11,648 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 4,649 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన 6,999 ఇళ్ల నిర్మాణాన్ని జూన్ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.మురళీమోహన్ తదితర అధికారులు ఉన్నారు.

స్తంభాన్ని ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన కారు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్‌సెంటర్ వద్ద ఘోర ప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న పెళ్లి కారు రాయగడ రోడ్డులోని గ్రోత్ సెంటర్‌లో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వేగానికి పక్కనే ఉన్న కాలువలోకి పక్కకి ఒరిగి పోయింది. ఈ సమయంలో విద్యుత్ నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు కారులోని పెళ్లి బృందాన్ని బయటకు తీశారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం, కొప్పుల వెలమ సంఘం రాష్ట్ర నాయకులు బలగ సాయికృష్ణ కుమార్తె పెళ్లి అనంతరం జరిగిన ఈ ఘటనలో కారులో సాయికృష్ణతో పాటు నలుగురు ఉన్నారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏం కాలేదు. ఘటన సంగతి తెలుసుకున్న బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ తన సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి ప్రయాణికుల క్షేమ సమాచారాలను కనుగొన్నారు. అంతా ఊపిరి పీల్చుకున్నారు.



కాలువలో పడిన కారు నుంచి ప్రయాణికులను ఒడ్డుకు తీసుకువస్తున్న స్థానికులు

చిట్టిబాబుకు జాతీయ అవార్డు



జాతీయస్థాయి అవార్డు అందుకున్న చిట్టిబాబు

విజయనగరం టౌన్: భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వ్యవస్థాపకుడు, భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డును జిల్లాకు చెందిన దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియన్ హేబిటేట్‌సెంటర్‌లో అందుకున్నారు. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సత్యానంద మిశ్రా, నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా డైరెక్టర్ బిరాజ్ పట్నాయక్, ఎన్‌సీడీహెచ్ఆర్ నేషనల్ జనరల్ సెక్రటరీ బీనాపలికల్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సమాజ మార్పునకు కృషిచేసే 14 మందిని గుర్తించి జాతీయ అవార్డు అందించారని, అందులో తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



గడ్డి మందు తాగి మృతి చెందిన శ్రీనివాస్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం గొటివాడ గ్రామానికి చెందిన తిమ్మక శ్రీనివాస్(40) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లోనే గడ్డి మందు సేవించిన శ్రీనివాస్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం లోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం శ్రీనివాస్ మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కురుపాం పోలీసులు తెలిపారు.

25న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సును ఈ నెల 25న ఆదివారం సాయంత్రం గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమ భక్తితత్వం అనే అంశంపై తాడేపల్లిగూడెంకు చెందిన తెలుగు పండితులు డాక్టర్ పి.రామచంద్రరావు వక్తగా ప్రసంగిస్తారన్నారు. శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక నిర్వహకులు నేమాని భద్రాద్రి సీతారామం సభాధ్యక్షత వహిస్తారన్నారు.

విజయభావన ప్రత్యేక సలహాదారు డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య కవితాపఠనం, ఉపాధ్యక్షుడు భోగరాజు ఖాదరవలీబాబూజీ సమ్మానకర్తగా వ్యవహరిస్తారన్నారు. సాహితీవేత్తలు, అభిమానులందరూ హాజరు కావాలని కోరారు.

ప్రజాగ్రహానికి రాజకీయ రంగు!

- పండగ ఏర్పాట్లలో వైఫల్యం
- రాజకీయాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు



చినకుమ్మరి వీధి వద్ద కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)



రామా కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

సాలూరు:

సాలూరులో శ్యామలాంబ పండగ అంగరంగ వైభవంగా చేసేందుకు పట్టణ ప్రజలతో పాటు లక్షలాది మంది భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు స్నేహితులు, బంధువులను పిలిచి మూడు రోజుల పాటు పండగ వైభవంగా చేసేందుకు సిద్ధమయ్యారు. అనుకున్నట్టు అంతా జరిగింది..వైఫల్యమంతా విద్యుత్ అంతరాయంలోనే కనిపించింది. మరోవైపు అంజలి రథ చక్రం విరిగడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. పట్టణ వాసులతో పాటు వచ్చిన భక్తులకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం చుక్కలు చూపించింది. మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయంతోనే సరిపోయింది. ఒకనొక సమయంలో స్థానికులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. పండగ పూర్తయిన తరువాత కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో పాలకులు, అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. దీంతో రోడ్లపైనే ప్రజలు విద్యుత్ సమస్యపై అర్ధరాత్రి వరకు బైఠాయించారు. అయినా అధికార పార్టీ నేతలు, అధికారుల్లో వీసమంతా చలనం లేకపోయింది. తీరా చూస్తే ఇప్పుడు దీనికి కూడా టీడీపీ శ్రేణులు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తోంది. అక్కడితో ఆగకుండా అధికారులపై అధికార పార్టీ నేతలు ఆగ్రహిస్తున్నారు.

ప్రజా సమస్యలకు రాజకీయ రంగు

పట్టణ ప్రజలు నాలుగు రోజుల పాటు కరెంట్ లేక ఇబ్బందులు పడి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపడితే దీన్ని ఓ పార్టీకి ఆపాదించే కుట్రలు పన్నుతున్నారు అధికార పార్టీ నేతలు. పండగ నేపథ్యంలో ప్రజలు రూ.కోట్లు ఖర్చు చేసి పండగను చేసుకున్నారు. కానీ విద్యుత్ సరఫరాలో తలెత్తిన సమస్యలతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడ్డారు. సమస్య ఆందోళనకు దారితీసే పరిస్థితులు వచ్చిన ఇటు పాలకులు కనీసం దాన్ని సరిచేసే ప్రయత్నం చేయలేదు సరికదా.. ఇదంతా రాజకీయమంటూ చెప్పడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ట్రాన్స్‌ఫార్మర్ల నాణ్యతపై అనుమానాలు

పండగ కోసం సుమారు కోటి 24 లక్షల రూపాయిలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అధికారుల మాటలను నమ్మి ఓ అడుగు ముందుకు వేసిన మంత్రి సంధ్యారాణి ఈ విషయమై ఉత్సాహంతో పండగ ఏర్పాట్లు చేసుకోండని పిలుపునిచ్చారు. తీరా చూస్తే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడికక్కడ కాలిపోయాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ సరఫరా అయిన ప్రాంతాల్లో లో, హై ఓల్టేజీలు తరచూ రావడంతో ఇళ్లల్లో గృహోపకరణాలు పాడయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పండగ నేపథ్యంలో విద్యుద్దీకరణ పనుల్లో కొందరికి ముడుపులు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే పండగ సమయంలో ఇంతగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పండగ సమయంలో మూడు రోజుల పాటు తలెత్తిన విద్యుత్ సమస్య నేటికీ చర్చనీయాంశంగానే ఉంది.

కొత్తపేటలో రెచ్చిపోయిన మట్టి మాఫియా



తలకి తీవ్ర గాయంతో కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు

- సర్పంచ్‌పై జనసేన కార్యకర్తల దాడి, తీవ్ర రక్తస్రావం
- మట్టి తవ్వకాల విషయంలో చెలరేగిన ఘర్షణ
- గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్

సర్పంచ్‌పై దాడి బాధాకరం: మాజీ ఎమ్మెల్యే




కేంద్రాస్పత్రిలో సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

కొత్తపేట గ్రామ సర్పంచ్‌పై జనసేన కార్యకర్తలు దాడి చేసి గాయపర్చడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. విజయనగరం కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావును ఆయన పరామర్శించారు. దశాబ్దాల నుంచి రాజకీయ జీవితంలో ఉన్నామని, కొట్లాడుకునే సంస్కృతికి ఎప్పుడు తావునివ్వలేదని, ప్రశాంతంగా ఉండే నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు ఎన్నడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఈ సంస్కృతి ప్రారంభమైందన్నారు. మట్టి తరలింపు విషయంలో సర్పంచ్‌ను రక్తం వచ్చినట్లు కొట్టడం సరికాదని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో జనసేన కార్యకర్తలు రెచ్చిపోయారు. ఏకంగా గ్రామ ప్రథమ పౌరుడిపైనే విచక్షణారహితంగా దాడి చేసి రక్తాన్ని కళ్ల చూశారు. తల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో విజయనగరం కేంద్రాస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. కొత్తపేటలోని చిన్న జగ్గయ్య చెరువు వేదికగా శుక్రవారం పక్కాపథకంతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో మట్టి తవ్వకాల విషయంలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, జనసేన కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. స్థానిక అవసరాల నిమిత్తం సర్పంచ్ మట్టిని తోలేందుకు ప్రయత్నించగా.. తాము మాత్రమే మట్టిని తరలించాలని, ఇతరులు తరలించడానికి వీలు లేదంటూ జనసేన కార్యకర్తలు తనపై దాడికి దిగారని, సువ్వాని రమణ అనే వ్యక్తి రాయితో బలంగా తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి జనసేన కార్యకర్తలు సువ్వానిపేట, కొత్తపేట చెరువుల్లో మట్టిని తరలించుకుపోతున్నారని, రోజూ వేలాది టన్నుల మట్టి తరలిపోతోందని సర్పంచ్ ఆరోపించారు. ఇదిలా ఉండగా తమకి కూడా గాయాలయ్యాయని జనసేన కార్యకర్తలు సువ్వాని రమణ, గురాన గోవింద, కల్యాణం లోకేష్, పంచాది రమణ, తదితరులు మిమ్స్‌లో చేరడం విశేషం. సర్పంచ్‌పై రక్తం వచ్చినట్లు దాడి చేసి తిరిగి వాళ్లే ఆస్పత్రిలో చేరడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ గణేష్ తెలిపారు.

కోవిడ్‌పై తస్మాత్..

- ఆందోళన అవసరం లేదు..
- డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి



డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: యావత్ ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ మహమ్మారి మళ్లీ పంజా విసురుతుంది. కోవిడ్ పేరు చెబితే ఇప్పటికీ జనం హడలిపోతున్నారు. మొదటి, రెండు కోవిడ్‌ల్లో కోవిడ్ బారిన ఎంతో మంది మృత్యువాత పడ్డారు. వేలాది మంది సకాలంలో చికిత్స చేయించుకుని ప్రాణాలతో భయపడ్డారు. రెండేళ్ల పాటు ప్రజలు కోవిడ్ కారణంగా బిక్కుబిక్కుమంటూ జీవించారు. గత కొన్నేళ్లుగా వ్యాప్తి లేకపోవడంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు. తాజాగా ప్రపంచలోని పలు దేశాలతో పాటు మన దేశంలో కూడా కోవిడ్ కేసులు మళ్లీ నమోదు అవుతున్నాయి. పొరుగున ఉన్న విశాఖలో కూడా కోవిడ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కోవిడ్ బారిన పడకుండా జనం అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి సూచించారు. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరేచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సామూహిక ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్కులు వాడాలన్నారు. భౌతిక దూరం పాటించాలని, హ్యాండ్ వాష్ తదితర వాటితో పాటు కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

జీకేఆర్ పురం నుంచి జపాన్‌కు..



ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ల కళాకారుడు సత్యం

బాడంగి: మండలంలోని జీకేఆర్ పురం గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ల కళాకారుడు నీలబోను సత్యం బృందానికి జపాన్ నుంచి పిలుపు అందింది. జపాన్‌లో తప్పెటగుళ్ల ప్రదర్శన ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడ నుంచి ఆయనతో పాటు ఆరుగురు కళాకారులు శనివారం జపాన్ చేరుకుంటారు.

అక్కడ మన దేశం తరఫున ప్రదర్శన ఇవ్వనున్నారు. జపాన్‌లో ఈ నెల 25 నుంచి 30వ తేదీవరకు నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల్లో తప్పెటగుళ్ల కళను ప్రదర్శిస్తామని సత్యం తెలిపారు. ఇతర దేశాలకు తమ కళను పరిచయం చేయడం గర్వంగా ఉందన్నారు.